స్టేటస్ సింబల్స్

అది మూడంకెల జీతగాళ్ళ కాలనీ!

కానీ, అందులో కొన్నిళ్లు పైకి నాలుగంకెల స్థాయికి ఎదిగి పోయినట్టు కనిపిస్తున్నయ్!

అందులో ఒక యిల్లు — దాని డ్రాయింగ్ రూము—కలర్ హిందీ సినిమా సెట్టులా వుంది

ఆ డ్రాయింగ్ రూమ్‌లో—ఈజిప్టు మహారాణిలా అందంగా అప్పుడే 'బ్యూటీ క్వీన్ కంటెస్ట్'లో పాల్గొనబోయే పదహారేళ్ళ పడుచులా వుండే—శైలజ కళ్లు, ఆ పూట ఎందుకో కంగారుగా—గోడగడియారం వైపు, తలుపు వైపు అసహనంగా చూస్తున్నయ్!

ఏదో పెద్ద ప్రేలుడుకు ముందుండే భయంకర నిశ్శబ్దత ఆవరించి వుంది ఆ గదిలో!

బేటరీతో నడిచే గోడగడియారపు ముల్లు—ధనిక, పేదవర్గాల ప్రతీకలుగా —ఒకదాని కొకటి—దూరం—దూరంగా —కదులుతున్నయ్!

ఆ రెండు ముళ్ళ మధ్యా—అందంగా రంగురంగుల్లో వున్న ఒక పక్షిబొమ్మ - ప్రాణం వున్నట్టు—ముందు వెనకలకి వూగిసలాడుతోంది.

ఇంతలో "అమ్మగారూ!" అన్న రహస్యపు పిలుపుతో శైలజ కంగారుగా సోఫామీదనుంచి లేచింది

"లక్ష్మీ! ముందు నువు లోపలికొచ్చి, ఆ తలుపు గడియ వేసెయ్!" అంది శైలజ మాట వినిపించీ వినపడనట్టు.

అప్పటికే ముఖంమీద పట్టిన చెమటను అనేకసార్లు తుడుచుకుంది శైలజ

"ఏం లక్ష్మీ! నా పేరు యెక్కడా బయటికి రాలేదుగా?" అడిగింది శైలజ మెల్లిగా, కంగారుగా

"మీ పేరు ఎలా రానిస్తానమ్మగారూ! మీరు చెప్పారుగా?" అంది పని మనిషి లక్ష్మి అభయం యిస్తున్నట్టు!

ఈసారి శైలజే వెళ్ళి కిటికీ రెక్కలు వేసొచ్చింది గోడకు చెవులుంటాయన్న విషయం ఆమెకు నమ్మకం లేదుగాని, గోడకు, తలుపులూ, కిటికీలూ వుంటాయని, 'నోరు దాటినమాట వూరు దాటుతుందని' ఆమె భయం

"ఏందో అమ్మగారూ! ఈళ్ళ

ఎమ్ డి సౌజన్య

జిమ్మడ....పుతుకుపడని కొత్త వాయలు చీరెగందా....అయినా పాతికా, ఇరవై కీ అడిగి నచ్చారు?" అంది బాధగా.

పనిమనిషి లక్ష్మిమాటల్లో ధ్వనిస్తున్న బాధ, సానుభూతికి శైలజ ఒక పక్క చలించిపోతూంది.

అయితే కొత్త వాయలుచీరె వంద రూపాయలది మరీ అంత అన్యాయంగా అడిగారని తెలిసి, ఏదో నిస్సత్తువ అమె నరనరాల్లో ప్రాకినట్టు, ఏదో తెలియని భయం, అమె వెన్నుపాములో ఆవరించినట్లనిపించింది.

"అక్కడికీ చెప్పానమ్మా! ఒక్క పుతుకూ పడలేదని—వెలసిపోయే రంగు కాదనీ, మడత మాత్రం ఒక్కసారి విప్పి కట్టిందని-'ఏం పుతుకు పడకపోయినా కొత్తదేం కాదుగదా' అని కొందరూ, 'ఈ చీరె నీ కెక్కడిది? కొత్త చీరె ఎవరైనా అమ్ముతారా, ఇలాటి దొంగ వస్తువులకు ఆశపడితే నీతోపాటు మాకూ మూడుతుంది' అని కొందరు - నానా మాటలూ అన్నారమ్మా?" అంది లక్ష్మి.

"పోనీ క నీ స ం ఓ నలభైకైనా ఎలాగో వదిలించలేకపోయావా?" అంది శైలజ ఎంతో దీనంగా.

"అయ్యోరాత! నేనే ఏదొంగతనమో చేసి, చా టు గా డబ్బుచేసుకోటానికి కక్కుర్తిపడుతున్నానని నన్నే మింగేసేటట్టు చూశారమ్మా!" అంది లక్ష్మి తానూ ఎంతో బాధపడిపోతూ.

"అయితే చీరె ఎవరూ కొనలేదా?" అంది శైలజ కంగారు కంగారుగా.

"మీరేమో డబ్బవసర మంటిరిగదా! అందుకే యిరవై కి ఎట్టాగో తెగనమ్మా!" అంది చావుకబురు చల్లగా చెబుతున్నట్టు.

"ఏమిటీ! వంద రూపాయల చీరె, యిరవై రూపాయలకా అన్న శైలజ బాధను అర్థంచేసుకున్న లక్ష్మి -

"మీరు యీ డబ్బొద్దంటే మీ చీరె మీకిత్తారమ్మా! ఆ మాట మరీ మరీ సెప్పే తెచ్చాను?" అంది లక్ష్మి రెండు మడతపెట్టిన పది రూపాయల కాగితాలు శైలజ చేతిలో పెడుతూ.

శైలజకు ఆ యిరవై రూపాయలూ చేతిలోకి తీసుకోటానికి ఓ రకం వణుకు పుట్టినా, డబ్బు సమయానికి చేతికంద డంతో వెయ్యేనుగుల బలం వచ్చింది.

కాని ఒక్కసారి గతంలో ఆ చీరెకు సంబంధించిన సంఘటన గుర్తుకు రావడంతో, శైలజ కళ్ళలో ఒక్కసారి నీళ్ళుబికాయి.

* * *

"ఇదుగో శైలూ! నీకోసం ప్రెజెంట్ ఏం తె చ్చా నో చెప్పుకో చూద్దాం!" అన్నాడు శేఖర్! శైలజ భర్త శేఖర్! చేసేది పెద్ద ప్రైవేటు కంపెనీలో చిన్న గుమాస్తా ఉద్యోగం.

నెలకొచ్చే ఏడొందలూ తప్ప వెనక ఏ స్థి ర చ రా స్థు లు లేని వుద్యోగం శేఖర్ ది!



అయితే శైలజ కాస్త తెలివైంది. చన్నీళ్ళకు వేణ్ణీళ్ళుగా 'నెహ్రూ ఇంగ్లీషు మీడియం సెంటర్' అనే ఓ బోర్డుపెట్టి, ఆ కాలనీలో పిల్లలకి ఒకటి నుంచి అయిదు వరకు చెప్పే 'ప్రైవేటు స్కూలు, ప్రారంభించింది

అయిదారు వందల కుటుంబాలున్న ఆ కాలనీలో మొదటి రెండు మూడేళ్ళు పట్టుమని పదిమంది పిల్లలు లేకపోయినా శైలజ శ్రద్ధవల్ల మహిళామండలి ఒకటి ప్రారంభించి శైలజే దానికి సెక్రటరీ అయి కాలనీలోని మహిళలందరితో పరిచయం పెరగడంతో, శైలజ నడిపే ఇంగ్లీషు మీడియం స్కూలు దోసపాదులా పిల్లలతో కలకలలాడసాగింది.

తరువాత మరో ఇద్దరు టీచర్స్కూడా అవసరం కావటంతో శైలజ హెడ్ మిస్ట్రెస్ అయిపోయింది. యిద్దరు టీచర్స్కు జీతాలు పోను – శైలజ వంతు ఓ రెండొందలు మిగులుతుండేవి.

హెడ్‌మిస్ట్రెస్ అన్న హోదా రావటంతో, ఆ స్టేటస్ మెయింటెయిన్ చేసుకోవటానికి శైలజ నానా యాతనా పడాల్సివచ్చింది దీనికితోడు మహిళా మండలి కార్యక్రమాలకి ప్రతిసారీ వందా యాభై ఆమె చేతివి పడడం ప్రారంభమయ్యాయి. ఇక ప్రతిసారీ రకరకాల చందాలు

హెడ్‌మిస్ట్రెస్ అవటంతో ముప్పయి నలభై రూపాయల చీరెల స్థానే వందా నూటయాభై రూపాయల నైలాన్, క్రేప్ సిల్క్ చీరెలు అవసరమయ్యాయి ఇక వాటికి తగినట్టే, గోల్డుచెయిన్ రిష్టువాచీ, ఫేషన్‌గా వుండే లాకెట్, ఇంగ్లీషు మాగజైన్స్, అదేవిధంగా పిల్లలూను

మహిళామండలి శెక్రటరీ, హెడ్

మిస్ట్రెస్ అన్న హోదాలతో తనకంటే ఎంతో సాంఘిక స్థాయిలో ఎదిగిన భార్యతో సరితూగటానికి, శేఖరమూ ఎంతో మారవలసి వచ్చింది

అతనూ కాటన్ షాంటూ, షర్టుస్థానే టెర్లిన్, టెరీన్-బెల్‌బాటమ్ ప్యాంట్లు, గ్వాలియర్, రేయాన్ కోట్లు తొడగడం సాగించాడు

ఇంత హైక్లాస్ డ్రెస్‌కు తగ్గట్టు హైహీల్డు పాయింటెడ్ షూస్, సీకో వాచ్, హిప్పీ హెయిర్ స్టయిల్‌కి మారవలసి వచ్చింది

ఇక మిగిలింది ఓ వెహికిల్

సిటీలో అదొక స్టేటస్ సింబల్

"ఇంట్లో ఏం తిన్నదీ ఎవరు చూశారు! నలుగురిలో బయటికి వచ్చేప్పుడు కాస్త రీకు రాకుగా, పిల్ల జమీందారులా కన బడాలి 'వెస్పా' లాంటి వెహికిల్ మనం ఎటూ కొనలేం! ఓ సెకండ్ హాండ్ లాంబ్రెట్టా చూడండి రోజూ కాస్త షికారుకి ఈవెనింగ్స్ షాపింగ్స్‌కి వెళ తుండవచ్చు!" అంటూ ప్రోత్సహించింది శైలజ

అప్పటికే ఇన్‌స్టాల్‌మెంటు సిస్టంలో చిన్న ఫ్రిజ్, రేడియోగ్రాం, టేప్ రికార్డర్, సీలింగ్ ఫాన్, సన్‌గ్లాస్ డైనింగ్ టేబుల్, సోఫాసెట్టు శైలజ సమకూర్చుకుంది

తరువాత పనిమనిషిగా లక్ష్మి కూడా అవసరమొచ్చింది లక్ష్మికీ - రెండు పూటలా టిఫిను, ఒకపూట భోజనంతో నెలకో ముప్పయి

తల్లితండ్రుల అలవాట్లే పిల్లలకూ వస్తాయంటారు అరుణకు, రవికి-తల్లి తండ్రుల అలవాట్లే వచ్చాయి ఇదివరకు పాసుతో సిటీబస్‌లో వెళ్ళేపిల్లలు ఇప్పుడు ప్రత్యేకంగా రిక్షాలో వెళ్ళటం అలవాటు పడ్డారు అయిదూ పది పైసల ఐస్ ఫ్రూట్లు కొనుక్కునేవాళ్ళు, ఫ్రూట్ సలాడ్‌లాంటి ఖరీదైన తిండ్లకి అలవాటు పడ్డారు

ఫలితంగా ఫ్యామిలీ బడ్జెట్ మునగటానికి సిద్ధంగా వున్న పడవలా తయారయింది

ఆ రోజు పదిహేడు వందలకు చౌకగా వచ్చిందని శేఖర్, సెకండ్‌హాండ్ ల్యాంబ్రెట్టా తెచ్చాడు

అందుకే 'శైలూ! నీకోసం ప్రెజెంటు ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం?' అన్నప్పుడు శైలజకు భర్త తెచ్చిందేమిటో, ముందు వూహించుకోలేక పోయింది.

భార్య ఎంతసేపటికీ ఏమీ చెప్పలేక పోవటంతో "డియర్ శైలూ! నువ్వు ఓడిపోయావు! 'సీయింగ్ యీజ్ బిలీవింగ్, బయట ఏముందో వెళ్ళి చూడో సారి!" అన్నాడు జడపట్టి లాగి

పంచకళ్యాణి గుర్రంలా స్టాండ్‌వేసి వున్న లైట్ బ్లూ కలర్ లాంబ్రెట్టా, చూసి-తన కళ్ళను తనే నమ్మలేక పోయింది శైలజ

"ఇది కలా నిజమా?!?!" అనే విషయం ఎటూ తేల్చుకోలేక వెళ్ళి చేతితో తాకి చూసింది శైలజ.



"ఆహా! ఈ కాలనీలో వెహికిల్ వున్నది మా ఫామిలీకే! ఇకనుంచి హాయిగా ప్రతివారం ఓ పిక్‌నిక్, ప్రతి సాయంత్రం షాపింగ్, ప్రతి ఉదయం ఓ చిన్న షికారు! ఈ వెహికిల్ రావటంతో నా ఫామిలీ స్టేటస్ ఎంత పెరిగిపోయిందో!" అని శైలజ, మబ్బుల్లో విహరించసాగింది

కాని ఆ పదిహేడు వందలు, నూటికి అయిదు రూపాయలు కాబూలీ వడ్డీకి అప్పుపుచ్చుకున్నట్టు తెలియగానే భయంతో తొట్రుపడిపోయింది శైలజ

"ఇప్పటికే ఎల్ ఐ సీ లోను, ప్రావిడెంట్ ఫండ్ లోను, ఫ్రిజ్‌కి, రేడియోగ్రామ్‌కి కట్టవలసిన ఇన్‌స్టాల్‌మెంట్సు కట్టలేక కటకట పడిపోతున్నాం! ఇప్పుడీ లాంబ్రెట్టా ఎందుకు అప్పుచేసి కొన్నారు?" అని చెబుదామనుకుంది శైలజ!

కాని తనేగా "స్టేటస్ సింబల్! స్టేటస్ సింబల్!" అంటూ భర్తను వెహికిల్ కొనమని ప్రోత్సహించింది

అక్కడికీ శేఖర్ "శైలా! మా కొలీగ్ ఒకడు 'వెస్పా' వెహికిల్ కొనటానికి యీ లాంబ్రెట్టాని అర్జంటుగా తెగనమ్ముతుంటే తెలిసి నేనే కొనేశాను! పద ఈ శుభసమయంలో నీకో మంచి చీరె ప్రెజెంటు చేయాలి!" అంటూ బయలుదేరాడు

భర్త అంత సంబర పడుతుంటే శైలజ కాదనలేకపోయింది

"నెల చివరి రోజులు! యిప్పుడు కొనబోయే చీరెకూడా, అప్పులో భాగమేగా!" అని శైలజ లోలోపల బాధ పడుతూంది

అయితే జానపద చిత్రాలలో యువరాజుతో పంచకళ్యాణి గుర్రమెక్కిన యువరాణిలా, శేఖర్‌తో లాంబ్రెట్టా

ఎక్కిన శైలజ, తమ బాకీల బాధ, భయం కాసేపు మరచిపోగలిగింది।

"శ్యారీస్ సెంటర్ దగ్గర దిగినశేఖర్- శైలజల జంటను షాప్ ప్రొప్రయిటర్ స్వయంగా ఆహ్వానించటం, గోల్డ్‌స్పాట్ యివ్వటం, షాపులో గుమస్తాలు అత్యంత భక్తిశ్రద్ధలు కనబరచటం చూస్తుంటే శైలజ తను ఎక్కడుందో మరచే పోయింది.

ఐతే ఆమెలో ఆమెకు తెలియకుండా వచ్చిన మార్పుకు శేఖర్‌కంటే, శైలజకే ఎక్కువ ఆశ్చర్యం అనిపించింది।

ఇదివరకు శైలజ ప్రతి వస్తువూ గీచి గీచి బేరమాడేది. కొనేది—ఒకటీ అరా చీరలైనా అన్ని షాపులూ తిరిగి తిరిగి ధరలు కనుక్కునేది। కిందపెట్టి మీదపెట్టి షాపువాణ్ణి వేధించి, యెంతో కొంత కన్సెషన్ ధరలో రాబట్టేది.

శైలజకి ఇవ్వాళ లాంబ్రెట్టామీద రావటంతో జరిగిన గౌరవ మర్యాదలకు బేరంచేయటం నామోషీఅనిపించసాగింది. అలాగే రోడ్డుప్రక్కన నాలుగు చక్రాల సైకిల్ బండ్లమీద అమ్మే వస్తువులు కొనడం చిన్నతనంగా అనిపించింది.

క్రమేపీ అనేక మార్పులు జరిగి పోయాయి. శైలజ ఒకసారి పనిమనిషి లక్ష్మితో "చూడు లక్ష్మీ। నువ్విలా చింపిరి తలతో, నూలు బట్టలతో మా యింటికి పనికి వస్తూండటం చూస్తే, ముందు మాకే నామోషీగా వుంది। నా పాత చీరెలు రెండిస్తాను. ఇకనుండి మా యింటికి వచ్చేప్పుడు అవే కట్టుకొస్తుండు।"అంది.

తరువాత లక్ష్మికూడా శైలజ అడుగు జాడల్లో నడుచుకోక తప్పింది కాదు.

దానికి సద్దన్నానికి బదులు కాఫీ, టిఫిను, నూలు బట్టలబదులు నైలాను, టెర్లిను ; పచ్చడి మెతుకులకు బదులు పసందైన కూరలు అలవాటు పడ్డాయి.

లక్ష్మిని చూసిన వాళ్ళెవరూ,ఇప్పుడు పనిమనిషి, అంట్లు తోముకునేది అను కోరు।

కాలం ఒకరీతిగా గడవదంటారు. అప్పటికే రకరకాల అప్పులతో 'మునగానాం,' 'తేలానాం'గా వున్న శైలజ కుటుంబ పరిస్థితి, ఒక్కసారి యిరుకున పడింది।

ల్యాంబ్రెట్టా వుండటంతో పావు గంటలో ఆఫీసుకు చేరుకోవచ్చన్న ధీమాతో, నేలమీద పైరు ఆననంత వేగంగా ల్యాంబ్రెట్టా మీద దూసుకు పోతున్న శేఖర్‌ని ఓ బెంజిలారి గుద్దేసింది.

ఫలితంగా కుడిచేయి, కుడికాలు పోయి-చావుతప్పి ప్రాణాలు దక్కించు కున్నాడు శేఖర్.

అయితే గవర్నమెంటు హాస్పిటల్ నుంచి బయటపడటానికి తొమ్మిదినెలలు పట్టింది.

ఒకప్రక్క ఉద్యోగం పోవటం, మరోప్రక్క 'సోషల్ స్టేటస్'। 'సోషల్ స్టేటస్' అంటూ చేసిన అప్పులతో ఒక్కో

వస్తువు - సగానికి సగంకంటే తక్కువ ధరకి అమ్మాల్సి వచ్చింది। నానా గడ్డి కరిచి కొన్న వస్తువులు అమ్మాల్సివచ్చి ఒకప్రక్క బాధ, మరో ప్రక్క అవి అమ్ముకుంటున్నట్టు తెలిస్తే ఎంత తల వంపులో అన్న భావన, భయం మరో ప్రక్క, శైలజ సతమత మవసాగింది

ఇలా అన్నీ అమ్ముకుని చివరికి ఖరీదైన చీరెలూ అమ్మ కొని, భర్త ల్యాంబ్రెట్టా కొన్నరోజు యిప్పించిన వాయిలు చీరె, రెండో కంటికి తెలియకుండా అమ్మే బాధ్యత నమ్మకంగా లక్ష్మి మీద పెట్టింది శైలజ

అప్పటికే లక్ష్మి శైలజ అమ్మే అనేక వస్తువుల అమ్మకంలో ఎంతగానో సాయపడింది।

శైలజ చివరికో రోజు "లక్ష్మీ। ఇక నీకు మేము పనియిచ్చే స్థితిలోలేము। ఇప్పటికే నీకు నాలుగునెలల జీతం నూటయిరవైదాక యివ్వాల్సి వుంది। యిదుగో యీ సోఫా కం బెడ్ అమ్మి- ఎంత దబ్బొస్తే అది నువ్వు తీసుకో। రేపు తెల్లవారు ఝూమున మీ ఆయన లాగుడు బండి తెచ్చి—యీ సోఫా కం బెడ్ తీసికెళ్ళు।" అంది రహస్యంగా

శైలజ మాటలకు లక్ష్మికి కళ్ళవెంట నీళ్ళొచ్చాయి। అయినా ఎలాగో నిగ్రహించుకొని వెళ్ళిపోయింది

శైలజ చెప్పినట్లు - లక్ష్మి భర్తతో, రెండోరోజు తెల్లవారు ఝూమున వచ్చి లాగుడు బండిలో సోఫా కం బెడ్ తీసు కెళ్ళింది।

చూస్తూ వుండగానే ఒక సంవత్సరం యిలాగే దొర్లిపోయింది.

ఇల్లు గడవటానికి మరో మార్గంలేక శైలజ అంగవైకల్యం సంప్రాప్తించిన భర్త శేఖరానికి తను యిన్నాళ్ళూపెంచి పోషించిన, 'ఇంగ్లీషు మీడియం స్కూలు అప్పగించింది।

శైలజ ఒక 'టాయిలెట్ కంపెనీ' వస్తువుల్ని యిళ్ళకు తిరిగి అమ్మే 'సేల్స్ వుమన్' వుద్యోగం సంపాదించింది। నెలకో నూటయాభై జీతం, షుమారుగా అంతకు తగ్గని కమీషను - ఆమెకు ప్రోత్సాహకరంగానే వున్నాయని పించింది

ఓ రోజు శైలజ తన టాయిలెట్ సేల్స్‌చేసే హేండ్‌బాగ్‌తో యిళ్ళు తిరుగు తున్నది

ఇంతలో మొలచుట్టూ చిన్న నిక్కరున్న పిల్లవాడు "అమ్మాయ్। నీ దగ్గర మంచి సెంటు వుందిట। నిన్న ఆ ఇంట్లో అమ్మింది నువ్వేగా। మా అమ్మ కొంటుందిట। అదే మా యిల్లు। రా। అన్నాడు

శైలజ సంతోషంగా ఆ పిల్లవాడి వెంట ఓ పూరిగుడిసెలోకి నడిచింది ఆ పూరిగుడిసెలో - ఓ సోఫా కం బెడ్ మీద సుతారంగా పడుకొని ఉన్న ఆడ మనిషి అదాటున లేస్తూ "శైలజమ్మ గారూ। మీరా।" అంది, గుర్తుపట్టి వాయిలు చీరె కుచ్చిళ్ళు సర్దుకుంటూ